## కేసీఆర్ నగర్ సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మూషం రమేశ్

కేసీఆర్ నగర్‌లో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 15: తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఇందుకు కలెక్టర్ బాధ్యత తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం కేసీఆర్ నగర్‌ను సందర్శించి, సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేసీఆర్ నగర్‌లో వారం రోజులుగా పారిశుధ్య పనులు నిలిపివేశారని, నీళ్లు రావడం లేదని, వీధిలైట్లు కూడా లేవన్నారు. వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నదని పేర్కొన్నారు. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. కేసీఆర్ నగర్ సమస్యల పరిష్కారం బాధ్యత కలెక్టర్ తీసుకోవాలని, వెంటనే ఎవరికైనా అప్పగించాలని కోరుతున్నామన్నారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి సమస్యలు పరిష్కారానికి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, అన్నల్ దాస్ గణేశ్, మూషం శంకర్, గోవిందు లక్ష్మణ్, తాటిపాముల లక్ష్మణ్, కట్ట రవికుమార్, సామల కవిత, కోడం కవిత, శైలజ, జయ, అరుణ, మనోహర్, ఆంజనేయులు, అంబదాస్, నరేశ్, కేసీఆర్ నగర్ వాసులున్నారు.

## లోలెవల్ బ్రిడ్జికి మరమ్మతులు

మూలవాగులో లోలెవల్ బ్రిడ్జి మరమ్మతు పనుల వద్ద గ్రామస్తులు

కోనరావుపేట, సెప్టెంబర్ 15: మండలంలోని వట్టిమల నిమ్మపల్లి మూలవాగు మధ్య ఉన్న లోలెవల్ బ్రిడ్జి ఇటీవలి వరద ఉధృతికి ధ్వంసం కాగా వట్టిమల్ల గ్రామానికి చెందిన కొమ్ము ఆనందం తన స్వంత నిధులతో మరమ్మతులు చేయించారు. గ్రామస్తులు, వాహనదారులకు మండల కేంద్రానికి, పంట పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులుకాగా రూ.30వేలు వెచ్చించి మట్టి పోసి తాత్కలిక మరమ్మతులు చేసినట్లు తెలిపారు. సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించిన ఆనందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మామిడిపల్లి గ్రామంలో కోతులు తెంపివేసిన పత్తి కాయలను చూపుతున్న రైతు నర్సయ్య

మామిడిపల్లిలో అడవి పందులు ధ్వంసం చేసిన పత్తి పంటను చూపుతున్న రైతు కిష్టస్వామి

# పంటల రక్షణకు పాట్లు

- అటవీ జంతువుల దాడిలో నాశనం
- పత్తి, పాలాన్ని ధ్వంసం చేస్తున్న పందులు
- పత్తి కాయలను కొరికి వేస్తున్న కోతుల గుంపు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

కోనరావుపేట, సెప్టెంబర్ 15: ఆరుగాలం రైతులు కష్టపడి సాగు చేస్తున్న పంటలపై అటవీ జంతువులు దాడులు చేస్తూ హడలెత్తిస్తున్నాయి. పంట వేసింది మొదలు, చేతికొచ్చే వరకు నాశనం చేస్తూ రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దీంతో అటవీ జంతువుల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. ప్రధానంగా పత్తి, వరి సాగుపై అడవి పందులు, కోతులు గుంపులు గుంపులుగా దాడులు చేయడంతో ఎలా కాపాడుకోవాలో అని హైరానా పడుతున్నారు. అటవీ శాఖ అధికారుల తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని వేడుకొంటున్నారు.

మర్తనపేటలో అడవి పందుల వల్ల దెబ్బతిన్న వరి

### పంటల రక్షణకు పడరాని పాట్లు

కోనరావుపేట మండలంలోని శివంగాళపల్లి, ఏగ్లాస్‌పూర్, మరిమడ్ల, వట్టిమల్ల, మామిడిపల్లి, మర్తనపేట, కోనరావుపేట, నాగారం, కనగర్తి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో రైతులు పత్తి, వరి, మక్క పంటలు సాగు చేస్తున్నారు. అటవీ జంతువులు పంటలను రేయింబవళ్లు ధ్వంసం చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రాత్రుల్లో పొలాల వద్ద జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చేను చుట్టూ పాత చీరలు

పంటలను కాపాడుకునేందుకు పోలం చుట్టూ రైతులు రంగురంగుల పాత చీరలను కట్టడంతో పాటు చిన్నపాటి వలలను చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా పందులు రాకుండా కటింగ్ షాపులో వెంట్రుకలను పొలం చుట్టూ చల్లుతున్నారు. కోతుల బెడదకోసం రేకు డబ్బాలను చప్పుడు చేస్తూ పంట చుట్టూ వైర్లను బిగించినా పంటలు పాడు చేస్తున్నాయని వాపోతున్నారు.

### ఆగం చేస్తున్న అడవి పందులు..

పంటలు ప్రస్తుతం కాత, దిగుబడి దశలో ఉన్న పత్తి పంట, పొట్ట దశలో ఉన్న వరి పంటల్లో అడవి పందులు విజృంభిస్తున్నాయి. పత్తి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పూత, కాత వచ్చిన చేనులో గుంపులుగా చేరి తొక్కడంతో పాటు పత్తి మొక్కలు విరిచి గూడు చేసుకుంటున్నాయి. మరికొద్ది రోజుల్లో చేతికి వచ్చే పత్తి పంటపై కోతులు దాడులు చేస్తూ కాయిలను తుంచివేస్తున్నాయి. అంతేకాకుండా చెట్లను విరిచివేసి అందులోనే గూళ్లు చేసుకుంటూ పిల్లలు చేయడం, పంటలను నేలమట్టం చేస్తున్నాయి. దీంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని రైతులు మదనపడుతున్నారు. అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడాలని కోరుతున్నారు. రైతులు పంటల రక్షణ కోసం ఆగచాట్లు పడుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పంటల రక్షణకు చర్యలతోపాటు సోలార్ కంచెలు రాయితీతో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వ్యవసాయ, అటవీ శాఖ అధికారులు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

### నష్టపరిహారం చెల్లించాలి

మామిడిపల్లి గ్రామంలో నాకున్న నాలుగెకరాల పత్తి పంట కాయ దశలో ఉండగా అడవి పందులు నాశనం చేశాయి. కోతులు మరో చేనులో కాయలను పూర్తిగా తెంపిపడేశాయి. ఇప్పటికే వర్షం వల్ల పత్తి ఎర్రబారిపోయి నష్టం వాటిళ్లగా, దీనికి తోడు అటవీ జంతువులు చేను నాశనం చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అడవి పందులు చేనులో గుంపులు, గుంపులుగా చొరబడుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు తగిన రక్షణ చర్యలు తీసుకొని నష్టపరిహారం అందిచేలా చర్యలు తీసుకోవాలి.

-మోకిడె కిష్టస్వామి, యువరైతు, మామిడిపల్లి

### మూడెకరాల వరి ధ్వంసమైంది

గ్రామంలో నాతో పాటు ముండ్రాయి విజయ్‌కుమార్, ఏషా మొండ య్య రైతుల వరి అడవి పందుల దాడిలో ధ్వంసమైంది. నాకున్న మూడెకరాల వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. కానీ అడవి పందులు రాత్రి గుంపులుగా చొరబడి పంటను మొత్తం నాశనం చేశాయి. పంటపై పెట్టుబడి పెట్టి చివరి దశలో ఇలా నష్టపోతున్నాం. ప్రభుత్వం ఆదుకొని, అటవీ జంతువుల బారి నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.

-బోనాల పూజిత్, యువరైతు, మర్తనపేట (కోనరావుపేట)

### నష్టపోయిన రైతులు సంప్రదించాలి

అటవీ జంతువుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులు తమను సంప్రదించాలి. పంట నష్టపోయిన తీరును వ్యవసాయాధికారులతో సంయుక్తంగా కలిసి పరిశీలిస్తాం. రైతులకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం. జంతువులను నుంచి పంటను రక్షించేందుకు సూచనలు, జాగ్రత్తలు చేయడంతోపాటు నష్టపరిహారం అందిచేందుకు కృషి చేస్తాం. రైతులు అడవిపందులు గుంపుగా ఉన్నప్పుడు అటువైపు వెళ్లకుండా ఉండాలి.

-అన్వర్, ఎఫ్ఎస్‌వో, వట్టిమల్ల

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న పీఈటీ

కోనరావుపేట, సెప్టెంబర్ 15: మండలంలోని నిజామాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు జిల్లాస్థాయి క్రీడల్లో రాణించారు. అండర్-14 విభాగంలో ఎండీ మునీర్ 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈనెల 19,20 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలో పాల్గొననున్నాడు. మునీర్‌ను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. ఇక్కడ జిల్లా అథ్లెటిక్ అసిసోయేషన్ కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టె ముక్కల శేఖర్, ప్రధానోపాధ్యాయులు షాబుద్దీన్, పీఈటీ అజయ్‌కుమార్ అభినందించారు.

## సౌత్ జోన్ రన్ ఎంపిక పోటీలు

గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వాహకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 15: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో తెలంగాణ స్టేట్ సౌత్ జోన్ రన్ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్-14, 16,18,20 విభాగాల్లో జరిగిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాలబాలికలు పాల్గొని సత్తాచాటారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తోపాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్‌ను నిర్వాహకులు అందజేశారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిలో 30 మంది క్రీడాకారులను ఈనెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, గొట్టె రాంచంద్రం, అజయ్‌కుమార్, కనకం శ్రీనివాస్, పీఈటీలు అశోక్, శ్రీనివాస్, సాయికుమార్, రాజు, తదితరులున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 15: తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ సాట్స్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2024పోటీలలో జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా నుండి 27 మంది బాలికలు, 9మంది బాలురు ఈ పోటీలకు హాజరైనట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీనియర్‌స విభాగంలో కుసుమ కుమారి, సందీప్, లావణ్య, సరళదేవి, యోగా కోచ్ బుర్ర అశోక్ పాల్గొన్నట్లు తెలిపారు.